క్లుప్తంగా

కాంగ్రెస్‌కు మద్దతు



మద్దతు తెలుపుతున్న యువకులు

ధారూరు: మండల పరిధిలోని మైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీల యువత నేతలు బుధవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. నిరుద్యోగ యువతను మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెబుతామని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తామన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కుల్కచర్ల: పేదల కష్టాలు తీర్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోప్యానాయక్ తండాలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసపూరిత మాటలతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఉద్యోగాలు లేక యువత తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, స్థానిక నాయకులు రాగ్యానాయక్, గోపాల్, హిర్యానాయక్, నారాయణ, బాల్య, తండావాసులు పాల్గొన్నారు.

దేవుడికి మతం లేదు



అమ్మవారి లడ్డూను అందుకుంటున్న అలీమ్

బొంరాస్‌పేట: భగవంతుని ఆశీర్వాదానికి కుల మతాలు అడ్డురావని నమ్మారు. మండల పరిధిలోని తుంకిమెట్లలో దుర్గామాతా నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి లడ్డూ, ఆభరణాలను వేలంలో ఆ గ్రామానికి చెందిన ముస్లిం అలీమ్ దుర్గామాత రూ.20,100కు దక్కించుకొన్నాడు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు లడ్డూ, ఆభరణాలను అందజేశారు.

రోహిత్‌రెడ్డిని గెలిపిస్తాం



విలేకరులతో మాట్లాడుతున్న వీరేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి గెలిపిస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకులు వీరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోటబాసుపల్లి సర్పంచ్ నాగార్జున ఆధ్వర్యంలో వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రజాల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చినా హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. తాండూరు మండలం నుంచి రోహిత్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మొగులప్ప, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ఎరన్‌పల్లి శ్రీనివాస్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కొడంగల్ : తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఉద్యమకారుల సంక్షేమం, అభివృద్ధికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఉద్యమకారులు శ్రీనాథ్‌సింగ్, బాలరాజు గౌడ్, నర్సిములు, రాజు, శివప్రసాద్‌లతో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్ మధుసూదన్ రావ్ యాదవ్, నరేష్‌గౌడ్, రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, దేశ్యానాయక్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీల జోరు.. ప్రచార హోరు

- పోటాపోటీగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రచారం
- చేరికలపై ప్రధాన ఫోకస్
- అభ్యర్థి ఎంపికలో కాషాయ పార్టీ జాప్యం



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి



టి రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి

పరిగి: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతోనే పరిగిలో పొలిటికల్ వార్ షూరువైంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించారు. బీజేపీతో పాటు ఇతర పార్టీలు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఆయా పార్టీల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పరిగి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతుండగా, అంతే దీటుగా కాంగ్రెస్ అభ్యర్థి డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి ప్రచారంలో దూకుడు పెంచారు. ఇరు పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఎవరికి వారు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ముఖ్య నేతలను పార్టీలో చేర్చుకొనేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. మరో వైపు కుల సంఘాల నేతలకు గాలం వేస్తూ ఓట్లు రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. మహేశ్‌రెడ్డి మండలాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు. రామ్మోహన్‌రెడ్డి గడపగడపకూ కాంగ్రెస్ పేరుతో గ్రామాల్లోకి వెళ్లి ఆరు గ్యారంటీలు, వరంగల్ డిక్లరేషన్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేదు.. దీంతో పార్టీ కార్యకర్తలు చిన్నాభిన్నం అవుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీసీ నినాదంతో టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ గ్రామాల్లో చాపకింద నీరులా పార్టీని బలోపేతం చేసుకుంటూ వెళ్తున్నారు.

ప్రచారంలో కుటుంబ సభ్యులు

అభ్యర్థుల కుటుంబసభ్యులు ఊరూర ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి భార్య ప్రతిమారెడ్డి ప్రచారంలో బిజీగా ఉన్నారు. గ్రామాల్లో తిరుగుతూ అసమ్మతి నేతలను బుజ్జగిస్తూ, మహిళలతో కలిసి ప్రచారంలో చేస్తోంది. అలాగే, కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి భార్య ఉమారెడ్డి, కుమారుడు రితిక్ రెడ్డి గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. రితిక్‌రెడ్డి యువకులతో మమేకమై ముందుకు సాగుతున్నారు.

అభ్యర్థి ఎంపికలో బీజేపీ ఆలస్యం

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులను ప్రకటించకపోవడం, పరిగి నుంచి డజన్ మంది టికెట్ కోసం దరఖాస్తులు చేసుకోవడంతో మొదటి జాబితాలో పరిగి పేరు లేకుండా పోయింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రచారంలో దూసుకుపోతుంటే బీజేపీ మాత్రం ఇంకా అభ్యర్థిని ప్రకటించకపోవడంతో పార్టీ క్యాడర్‌లో అయోమయం నెలకొంది. టికెట్ కోసం ఎవరికి వారు జాతీయ, రాష్ట్ర నేతలను ప్రసన్న చేసుకునే పనిలో పడ్డారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు దీటుగా అభ్యర్థులను ప్రకటిస్తారని పార్టీ పెద్దలు చెబుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని తీసుకువస్తున్న సుధాకర్‌రెడ్డి దంపతులు

అనంతగిరి: వికారాబాద్‌లోని అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయం 5వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ధ్వజారోహణం, అర్చనలు, అభిషేకాలు, అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం 9.30గంటలకు గణపతి, రుద్రహోమం , 11.30గంటలకు ఆలయ ధర్మకర్త సుధాకర్‌రెడ్డి దంపతులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, ఆయన కూతురు అనన్య చేతన్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది అసత్య ప్రచారం



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ నాయకులు లేనిది ఉన్నట్లుగా చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని చౌడాపూర్ మండల బీఆర్‌ఎస్ నాయకులు కోస్గి నరేష్, మొగులయ్య అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో దళిత సంఘాల కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆపార్టీ నేతలు ప్రకటించడంపై బీఆర్‌ఎస్ నాయకులు విలేకరుల సమావేశంలో ఖండించారు. ఒకే కుటుంబానికి చెందిన 10మంది చేరితే, 50మంది అని గొప్పలు చెప్పుకోవడం, కాంగ్రెస్ వారికే కండువాలు కప్పి కొత్తగా చేరారని ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకటమ్మ, పద్మమ్మ, నర్సమ్మ, గౌరమ్మ, పుష్పమ్మ, అశోక్, మహేశ్, గణేశ్, నరేందర్, ప్రశాంత్, మహేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయండి



మాట్లాడుతున్న భీంభరత్, ఇతర నాయకులు

కాంగ్రెస్ నాయకుడు భీంభరత్

అనంతగిరి: నవాబ్‌పేట మండలం గంగ్యాడ గ్రామ సమీపంలో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ రెడ్డిపై హత్యాయత్నం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భీంభరత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఉపేందర్‌రెడ్డి సతీమణి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో జిల్లా ఎస్పీని కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గంగ్యాడ బీఆర్‌ఎస్ నాయకుడు మల్లేష్ అతని అనుచరులు అకారణంగా దాడి చేశారని ఆరోపించారు. అదృష్టవశాత్తు ప్రాణాలతో తప్పించుకున్నారన్నారు. ఓటమి భయంతోనే స్థానిక ఎమ్మెల్యే భౌతిక దాడులకు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు భయపడాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం పట్టణంలోని ఈషా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఉపేందర్‌రెడ్డిని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో నవాబుపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, బ్లాక్ అధ్యక్షుడు పోలీస్ మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్, సామ వెంకట్‌రెడ్డి, మీనపల్లి కలాన్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ రాములు, మండల యూత్ ప్రెసిడెంట్ ప్రసాద్, యూత్ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పెంటారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరిస్తాం



రోడ్డుపై పారుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: మురుగు కాల్వలతో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని కుల్కచర్ల ఎంపీఓ కరీం అన్నారు. మండలంలోని కామునిపల్లిలో మురుగునీరు రోడ్డుపై పారుతుండటంపై గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదులపై అధికారులు స్పందించారు. దీంతో బుధవారం ఎంపీఓ ఖరీం, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి గ్రామానికి వెళ్లి సమస్యను పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నేడు చంద్రవంచ దర్గా ఉత్సవాలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ గేటు వద్ద ఉన్న మహబూబ్ సుభాని దర్గా ఉత్సవాలు నేడు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం గంధం ఉత్సవాలు, శుక్రవారం జాతర కొనసాగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కుల్కచర్ల: ఉచిత కంప్యూటర్, టైలరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి గల యువతీ యువకుల దరఖాస్తు చేసుకోవాలని శ్రీరామ లింగేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని యువతకు ఉపాధిని కల్పించాలనే ఉద్దేశంతో ఉపాధి కోర్సులను అందించడం జరుగుతుందన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత, 16సంవత్సరాల నుంచి 30సంవత్సరాల లోపు వారికి మాత్రమే శిక్షణ ఇస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 8688002634 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం

మండల ఉపసర్పంచ్‌లు

యాలాల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమ మద్దతు ఎవరికివ్వాలనే విషయమై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల ఉపసర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రస్తుత ఉపసర్పంచ్‌లతో పాటు మాజీ ఉపసర్పంచ్‌లు ఒకతాటిపై వచ్చామని, తమ మద్దతు ఎవరికివ్వాలో త్వరలో నిర్ణయిస్తామన్నారు. పార్టీలకతీతంగా ఆలోచించి అందరం ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. జక్కేపల్లి ఉపసర్పంచ్ మహిపాల్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండలంలోని ఉపసర్పంచ్‌లు, మాజీ ఉపసర్పంచ్‌లు ఉన్నారు.

పార్టీకి ఎలాంటి నష్టం లేదు

పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్

తాండూరు రూరల్: ఎవరూ పార్టీ మారిన బీఆర్‌ఎస్‌కు ఎలాంటి నష్టం లేదని ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వార్థం కోసం పార్టీ మారుతున్నారని.. ప్రజలు తమవైపే ఉన్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లాకు సాయుధ సరిహద్దు దళం



ఎస్పీతో ఎస్ఎస్‌బీ అధికారులు

అనంతగిరి: జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఎస్ఎస్‌బీ (సాయుధ సరిహద్దు దళం) అధికారులు ఎస్పీ కోటిరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లాలోని సమస్యాత్మక పరిస్థితుల గురించి అధికారులకు తెలియజేశారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా సహకరించాలని, ఇబ్బందులు ఉంటే వెంటనే తెలియజేయాలని వికారాబాద్ జిల్లా పోలీసు ఎప్పుడు ఎస్ఎస్‌బీ అధికారులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ వీరేశం, సీఐ రాజు, ఆర్ఐ సూరప్ప నాయుడు, అంజాద్ పాషా సశస్త్ర సీమాబల్ అసిస్టెంట్ కమాండర్ పవన్, ఇన్‌స్పెక్టర్ సహదేవ్, సంతోష్, మెడికల్ అధికారి అతికాప్ రాజీనా పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



ర్యాలీ పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్ , బీఆర్‌ఎస్ శ్రేణులు

అనంతగిరి: తనను మరోసారి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వికారాబాద్ పట్టణంలోని కొత్తగడిలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్నానని అన్నారు. మన ప్రాంత సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించానని తెలిపారు. మరోసారి అవకాశం ఇస్తే వికారాబాద్‌ను అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ముందువరుసలో ఉంచుతామన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అధికారంలోకి వచ్చిన వెంటనే రూ 400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. అర్హులైన పేదలకు ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హులైన మహిళలకు మూడు వేల గౌరవ భృతి ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు పుష్పలత రెడ్డి, పావని రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రాజమల్లు, సీనియర్ నాయకులు విజయ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, కమల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి , మల్లేశం, బీఆర్‌ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు మంచి ఆదరణ

మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్



ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

మర్పల్లి: ఆరు గ్యారంటీ స్కీంలకు గ్రామాల్లో మంచి ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ సర్పంచ్ తుమ్మల సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని పట్లూర్‌లో ఎంపీటీసీలు స్వప్న, మంజుల పలువురు సీనియర్ నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్కీముల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి ఆ కుటుంబ యజమాని నుంచి సంతకంతో కూడిన రశీదును తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ హామీ నెరవేర్చాలేదని, తీరా ఎన్నికల సమయంలో మాఫీ చేసినా వడ్డీలకే సరిపోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రెండు లక్షలు రుణమాఫీ చేస్తామన్నారు. గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి అభ్యర్థి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మద్దతు తెలుపుతున్నారు. ఎంపీటీసీలు స్వప్న, మంజుల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు సురేష్, మహేశ్, మాజీ ఎంపీటీసీ రాజు, మండల ప్రధాన కార్యదర్శి రాకేశ్, గ్రామ కమిటీ యూత్ ప్రెసిడెంట్ ప్రశాంత్, మైనార్టీ నాయకుడు మజ్జు, కార్యకర్తలు ఉన్నారు.

శుభప్రద్ పటేల్‌తో ఎమ్మెల్యే భేటీ



శుభప్రద్ పటేల్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు టౌన్ : రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. తాండూరులోని ఆయన కార్యాలయానికి వెళ్లి ఆయన చర్చించారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు, అభివృద్ధితో మూడోసారి సీఎం కావడం ఖాయమని, తాండూరులో తన గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే శుభప్రద్ పటేల్‌ను కోరారు. తప్పకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తిరుగుతానని శుభప్రద్ పటేల్ ఎమ్మెల్యేకు చెప్పారు. అలాగే, పలువురు ఉద్యమకారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం బంగారు తెలంగాణ కావాలంటే మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలన్నారు. సమావేశంలో ఉద్యమకారులు వీరమణి, ముజీబ్, దత్తాత్రేయ, నాగేందర్, ప్రకాష్, గయాజ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న బిచ్చిరెడ్డి , మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి

దోమ : నామినేషన్‌కు వేసేందుకు ఎమ్మెల్యే మహేశ్ రెడ్డికి దోమ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి చుక్కన్నగారి బిచ్చిరెడ్డి రూ. 10 వేల విరాళం అందజేశారు. బుధవారం దోమలో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి చేతుల మీదుల ఎమ్మెల్యేకు విరాళం అందజేశారు. మరోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు అనిల్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి ప్రతిమా రెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యులు ఖాజపాష, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌కుమార్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

తాండూరు: తాండూరు అసెంబ్లీ స్థానం కాంగ్రెస్ పార్టీ ఖాతాలో చేరడం ఖాయమని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో మనోహర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, అబ్దుల్ రజాక్, బోయరవిరాజ్, బీఆర్‌ఎస్ పార్టీ తాండూరు పట్టణ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్‌లతో పాటు వందలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాల వల్లే నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంపత్‌కుమార్ తదితరులున్నారు.

నేడు కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఉదయమోహన్ రెడ్డి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలో కాంగ్రెస్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కె.ఉదయమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని పల్లె రుచులు హోటల్ మొదటి అంతస్తులో కాంగ్రెస్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు జరగనుందని తెలిపారు. కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.